# వయసు - మనసు

కొఠారి వాణీచలపతిరావు



నిలువుటద్దం ముందు నిల్చొని తల దువ్వుకుంటోంది సుగుణ. రోజూ అద్దంలో తనను తాను చూసుకుంటున్నా, ఆ రోజెందుకో ఆమె చూపులు తన ప్రతిబింబాన్ని పరిశీలనగా చూసుకున్నాయి. 'ఇప్పుడు తను చాలా లావయ్యింది. ఇద్దరు పిల్లల తల్లి అవటంవల్ల పొట్టకూడా బాగా వచ్చింది. ఎంతలో ఎంత మార్పు?! అప్పటి సుగుణకు, ఇప్పటి సుగుణకు అసలు ఏ మాత్రమైనా పోలిక ఉందా? అనుకుంది సుగుణ. లేడి పిల్లలా గంతులు వేస్తూ, మొగలి పువ్వులా దూరం నుండే అందర్నీ ఆకర్షిస్తూ 'అందం, యవ్వనం' తెచ్చిన మిడిసిపాటుతో చాలా ఆనందంగా కాలం గడిపేది తను. గడచిన ఆ రోజులు తియ్యగా ఆమె స్మృతి పథంలో మెదిలాయి.

• • •

అద్దం ముందు నిల్చొని దట్టమైన నిగ నిగలాడే నల్లటి జుట్టును అందంగా 'పోనీటైల్'గా బిగించి, రంగు రంగుల రబ్బర్ బ్యాండ్, పక్కపిన్నులు పెట్టుకుంది సుగుణ. 'ఐబ్రో' పెన్సిల్‌తో కను బొమలు సరిదిద్దుకుని, పెదాలకు లిప్‌స్టిక్, దాని పైన 'లిప్‌బ్లేజ్' పెట్టుకుంది. దోసగింజ ఆకారంలో ఉన్న మెరిసే చెమ్కీ బొట్టును నుదుటికి అంటించుకుంది. షెట్‌షల్వారి 'చున్నీ'ని మరో సారి సవరించుకుంటుంటే, అంతవరకు ఓపిగ్గా అద్దం కోసం వెయిట్ చేస్తున్న తమ్ముడు గోపి ఎప్పుడు వెళ్ళాడో వెళ్ళి అమ్మతో మొరపెట్టుకోవడం మొదలుపెట్టాడు.

"అమ్మా! సుగుణక్క చూడూ. ఎంతసేపయినా అద్దం ముందు నుంచి కదలదు. నాకు ఒక పక్క స్కూలుకు టైమ్ అవుతోంది" అని అమ్మకు కంప్లయింట్ చేస్తుంటే సుగుణకు ఒళ్ళు మండి పోయింది.

వాడి నెత్తిన ఒక్క మొట్టికాయ వేసి "మగ పిల్లాడివి నీ కెందుకురా ఇంత పెద్ద అద్దం? అవతల చిన్న అద్దం ఉంది కదా వెళ్ళి చూసుకో రాదూ?" అంది.

"ఏం? ఆడపిల్లలే షోకులు చేసుకోవాలా? మగ పిల్లలు మాత్రం అందంగా తయారుకావద్దా. ఇన్‌షర్ట్ 'టక్' చేసుకోవాలంటే చిన్నద్దంలో ఏం కనిపిస్తుంది? మీ ఆడపిల్లల షోకులన్నీ ముఖం మీదనే కనుక మీకే చిన్నద్దం సరిపోతుంది" అన్నాడు గోపి అక్కను ఉడికిస్తూ.

"భూమికి జానెడులేవు నీకు అప్పుడే పాంటు, అందులో ఇన్‌షర్ట్ కూడాను. వెధవకు ఇప్పటి నుండే హీరో పోజులు ఎక్కువైపోతున్నాయి." అని గొణుక్కుంటూ హ్యాండ్ బాగ్ తగిలించుకుని, మోపెడ్ మీద తూనీగలా కాలేజీకి వెళ్ళిపోయింది సుగుణ.

కాలేజీలోకి అడుగుపెడుతూనే అందరి కళ్ళూ తన మీదే ఉండటం గమనించిన సుగుణ నడకలో మరింత హొయలు, కళ్ళల్లో మరింత గర్వం తొంగిచూసాయి. "అనుకున్నాను. ఈనాటి నా డ్రస్సింగ్, మేకప్ ఇంత మందిని 'స్మాష్' చేస్తుందని" అనుకుంది సుగుణ గర్వంగా.

మరికొన్నాళ్ళకు సుగుణకు ఇంకో రహస్యం కూడా తెలిసిపోయింది. కాలేజీ కుర్రాళ్ళంతా కాలేజీకి రెగ్యులర్‌గా వచ్చేది తన అందం చూడటానికే గానీ క్లాసులు అటెండ్ చేయడానికి కాదని.

'జీవితం అంటే ఇదే! జలజల వారే సెలయేరు లాంటి ఈ జీవితంలో అందం ఉంది. ఆకర్షణ ఉంది. థ్రిల్ ఉంది' అనుకుంది సుగుణ గర్వంగా. ఫ్రెండ్స్, సినిమాలు, షికార్లు, అలంకరణలు వీటితో ఎప్పుడూ ఏదో బిజీ, ఏదో హడావుడీ, ఏదో సందడి. రోజులు క్షణాల్లా, పూలరథమెక్కి సాగిపోతున్నట్లు అనిపిస్తోంది. 'నిజంగా 'మనిషి' జీవితానికి యవ్వనం ఒకవరం.' అనిపించింది సుగుణకు. కాలేజీలో ఫ్రెండ్స్ మధ్య ఉన్నంత సేపూ జెట్‌స్పీడ్‌లో పరిగెత్తుతున్నట్లుండే మనసు ఎందుకో ఇంటికి రాగానే కళ్ళెం పడిన గుర్రంలా తయారవుతుంది.

ఎప్పుడూ ఇంటిపని, వంటపనితో సతమత మవుతూ వీధి గుమ్మం ముఖమైనా చూడని అమ్మను, ఎప్పుడూ డబ్బు సంపాదన, ఏవో కూడికలు, తీసివేతలు; పెళ్ళిళ్ళులు, వడుగులు, బాధ్యతలు అంటూ నిరాశగా, నిస్పృహగా

మాట్లాడుతున్నట్లుండే నాన్నను చూస్తూంటే జాలి వేస్తుంది. ఇదీ జీవితమేనా అనిపిస్తుంది. ఇక ఇద్దరు ఎడ పిల్లలతో మూడో కాన్పు. పురిటికి వచ్చిన అక్కయ్యను చూస్తుంటే విపరీతమైన జాలి వేస్తుంది. పిల్లల ఏడ్పులు, చీమిడి ముక్కులు, వాళ్ళ అల్లరితో ప్లాట్‌ఫాంలా మారిన ఇల్లు అందులోని పగిలిన గ్లాసులు, విరిగిన కుర్చీ కర్రలు ఇవన్నీ చూస్తుంటే 'బాబోయ్! ఈ జీవితం పగవాడికి కూడా వద్దు' అనిపిస్తుంది. 'పెళ్ళయిన ఆడదాని జీవితం ఎంత నరకం? ఇల్లు, మొగుడు, పిల్లలు తప్ప ఆ జీవితానికి ఒక అందం, ఆనందం, ఆశయం అంటూ ఉండవు కదా. నాకు మాత్రం చస్తే అలాంటి 'డర్టీ' లైఫ్ వద్దు. ఆడదాన్ని జీవిత ఖైదీగా కట్టిపడేసే ఆ వైవాహిక జీవితాన్ని తను కలలోనైనా ఊహించలేదు. ఒంటరిగా, స్వేచ్ఛగా చలాకీగా జీవితం గడిపే తను వీళ్ళందరికన్నా ఎంత అదృష్టవంతురాలు' అనుకుంది సుగుణ గర్వంగా.

అలా అనుకున్న సుగుణే ఒక శుభ ముహూర్తాన సతీష్ ప్రేమలో పడింది. అతని రాక కోసం చంద్రుని కోసం ఎదురుచూసే 'కలువ'లా ఎదురుచూసేది. అతని మాట చెవులకు వినబడితే 'గంధర్వగానం' విన్నంతగా పొంగిపోయేది. అతని పక్కన కూర్చోవాలనీ, అతన్ని స్పర్శించాలనీ మనసు ఉవ్విళ్ళూరేది. 'ప్రేమ ఎంత మధురం?!' 'ప్రేమ'కు నోచుకోని జీవితం నిస్సారం, నిరర్థకం కదా అనిపించేది. సతీష్ తనతో ప్రేమగా 'ప్రాణానికి ప్రాణం' అన్నట్లుగా మాట్లాడుతుంటే ఈ ప్రపంచమంతా 'ప్రేమ మయం'గా కనిపించేది. అప్పుడనిపించింది 'జీవితం' అంటే ఇదే అని. సతీష్‌ని పొందలేని తన జీవితానికి అర్థం, పరమార్థం లేవనిపించింది. అతను తనవాడు కాకుంటే తను అసలు బ్రతకలేనేమో అనిపించింది.

ఆ స్థితికి చేరుకున్న మరునిముషమే సుగుణ, సతీష్ అర్థాంగి అయిపోయింది. జీవితానికి ఒక తోడు, ఒక నీడ, ఒక జంట దొరికిన తర్వాత తన జీవితానికి ఒక పరిపూర్ణత సిద్ధించినట్లయింది. తనకు కొండంత అండ, రక్షణ, గౌరవప్రదమైన 'ఇల్లాలి' స్థానం లభించినట్లయింది. భర్తకు ఇష్టమైన వంటలు చేసి పెట్టడం, అతను రుచిగా ఉన్నాయని మెచ్చుకుంటుంటే కొసరి కొసరి వడ్డించడం, అతని కోసం క్షణమొకయుగంగా ఎదురు చూడటం, స్కూటర్ మీద అంటుకొని కూర్చొని సినిమాలకు, షికార్లకు వెళ్ళడం ఓహ్! ఇది జీవితం అంటే అనిపించింది.

• • •

గడచిన జీవితానుభవాలను నెమరు వేసుకుంటున్న సుగుణ చంటిపిల్ల ఏడుపు వినిపించి దిగ్గున ఈ లోకంలోకి వచ్చింది. రెండేళ్ళ 'చిన్ని' పారాడుకుంటూ తన దగ్గరికి వచ్చి చీరకుచ్చిళ్ళు పట్టుకొని పైకి లేచి నిల్చుని 'ఎత్తుకో'మని ఏడుస్తున్నది. ఆ దృశ్యం చూసిన సుగుణ మనసు కూతురి మీద జాలితో నిండిపోయింది. తన పరధ్యానానికి తనను తానే నిందించుకుంటూ 'ఒరచిన్నీ! ఏడుస్తున్నావా? నా తల్లి కదూ- ఏడ్వకమ్మా! నేను నిన్ను ఎత్తుకుంటాను. నీకు మంచి మంచి బొమ్మలు ఇస్తాను. మా తల్లివి కదూ! ఏడవకమ్మా' అని బుజ్జగించి, లాలించి 'చిన్ని' కిలకిల నవ్వే వరకు వదిలిపెట్టలేదు సుగుణ. బోసి నవ్వులతో తిరిగి 'చిన్ని' ఆటలో పడేవరకు ఆమె మనసు మనసులో లేదు. 'చిన్ని' ఏడిస్తే తను చూసి భరించలేదనిపించింది.

ఇంతలో ఐదేళ్ళ 'నానీ' స్కూలు నుండి రిక్షా దిగి లోపలికి వస్తూ కనిపించాడు. రేగిన జుట్టుతో, జారిపోతున్న నిక్కరుతో పుస్తకాల బరువును వీపు మీద మోయలేక మోస్తూ నడుస్తున్న 'నానీ'ని చూడగానే సుగుణ హృదయం ఆనందంతో, జాలితో సముద్ర తరంగంలా ఉవ్వెత్తున లేచింది. రాగానే వాడికి కాళ్ళూ, చేతులూ, ముఖం కడిగి డ్రస్ మార్చి తినటానికి ఏమైనా పెట్టాలి. వచ్చినప్పటి నుండి వాడు 'వసపిట్ట'లా స్కూలు గురించి, టీచర్ల గురించి, స్నేహితుల గురించి వాగుతూనే ఉంటాడు. ముద్దు ముద్దు మాటలతో కళ్ళూ, చేతులూ తమాషాగా తిప్పుతూ వాడుకబుర్లు చెబుతూంటే వినటానికి ఎంత బాగుంటుందో! స్కూలు నుంచి వస్తూనే ఎన్నో సంవత్సరాల నుండి తనను చూడనట్లు ఆ చిన్ని చిన్ని చేతులతో తనను చుట్టేసుకుని 'అమ్మా' అంటూ అమాంతం మీద పడిపోతాడు. తన మీద అంత ప్రేమ నింపుకున్న ఆ చిన్నారులను ఇద్దరినీ చూస్తుంటే సుగుణ మనసు కూడా ప్రేమతో ఉప్పొంగిపోతుంది. నిజంగా పిల్లల్ని కనిపెంచడంలో తల్లి ఎంతటి మధురానుభూతిని పొందుతుంది! తన రక్తంలోని రక్తం, తన మాంస ఖండాలలో నుంచి ఓ మాంస ఖండం తొలిసారిగా పేగు తెంచుకొని భూమిమీద పడ్డప్పుడు ఆ స్త్రీ అనుభవించే ఆనందం మాటలకు అందేదేనా? అది అనుభవించితేనే అర్థమయ్యేది తప్ప. మాతృత్వంతో స్త్రీకి గౌరవం, పరిపూర్ణత లభిస్తుంది. అది స్త్రీ జాతికి లభించిన ఒక వరం.



పాలు త్రాగనని మొండికేసే పిల్లలకి అందులో కస్టర్డ్ పౌడర్ కలిపి, గ్రైండ్‌చేసి, పంచదార కలిపి యివ్వండి. గుటగుట త్రాగేస్తారు- యింకా యింకా ఆ పాలే కావాలంటారు. కస్టర్డ్ పౌడర్ ఎప్పుడూ యింట్లో ఉంచుకోండి మిల్క్‌షేక్‌లాంటి ఆ పాలను పిల్లలు ఎంతో యిష్టంగా తాగుతారు!

జి.రామలక్ష్మి

తన శరీరంలో ఒక భాగమైన తన పిల్లలు ఎప్పుడూ సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని ప్రతి తల్లి కోరుకుంటుంది. వాళ్ళ కంట్లో నలుసు పడ్డా, కాలిలో ముల్లు గుచ్చుకున్నా ఆ తల్లిప్రాణం విల విలలాడిపోతుంది. వాళ్ళ కష్టాలన్నీ తను గ్రహించి, తన సుఖాలన్నీ వాళ్ళకు ధారపోయటానికి సిద్ధంగా ఉంటుంది. ఒకసారి 'నానీ'కి హై టెంపరేచర్ వచ్చి, హాస్పటల్‌లో చేర్చాల్సి వచ్చినప్పుడు తను ఎంతగా ఏడ్చింది? ఎన్ని దేవుళ్ళకు మొక్కుకుంది? తలుచుకుంటే సుగుణకు ఇప్పటికీ గుండె ఆగిపోయినట్లు అనిపిస్తుంది. ఒకసారి చిన్ని నీళ్ళ తొట్టి దగ్గర ఆడుతూ ముందుకు వంగి అందులో పడిపోతే వెంటనే చూసింది గనుక తన బిడ్డను తను రక్షించుకోగలిగింది. 'అదే! తను రావటం కాస్త ఆలస్యమయితే!' అన్న ఆలోచన వస్తే సుగుణకు పై ప్రాణాలు పైనే పోతున్నట్లు అనిపిస్తుంది. తన ఆయుష్షు కూడా తన పిల్లలకు పొయమని నిత్యం దేవుణ్ణి ప్రార్థించే తల్లి తన బిడ్డకు ఏమైనా అయితే భరించగలదా? భరించలేదు. అదే సృష్టి మహాత్యం. అదే కన్న కడుపులో దాగున్న జన్మ రహస్యం.

ఒక భార్యగా, ఒక అమ్మగా తన చుట్టూ అల్లుకున్న బంధాలు, అనుబంధాలు సుగుణలో తనను గురించి తాను ఆలోచించే తీరికా, ఆసక్తి లేకుండా చేసాయి. ఆనాటి అలంకరణలు, ఆ అహం, ఆ అందం, ఆ చురుకుతనం అన్నీ ఎక్కడికి పోయాయో అర్థం కావటం లేదు. ఎప్పుడన్నా ఇలా అద్దం ముందు నిల్చున్నప్పుడే అప్రయత్నంగా తన దృష్టి తన ఆకృతి మీద పడుతుంది. సిజేరియన్లవల్ల పెరిగిన పొట్ట, వయసు తెచ్చిన హుందాతనంవల్ల కాస్త లావైన శరీరం కనిపించినప్పుడల్లా ఆమె పెదవులమీద ఒక శుష్క దరహాసం తృటి కాలం నిలుస్తుంది. అప్పుడు కాలం రేసు గుర్రంలా పరుగెత్తుతున్నట్లు అనిపిస్తుంది.

అయినా సుగుణ శరీరంలో అందం, ఇంకా పుష్కలంగానే ఉంది. ఇప్పుడప్పుడే నడివయసులోకి అడుగుపెడుతున్న ఆమెలో ఇప్పుడు హుందాతనం ఉంది. తనను గురించి తను ఎప్పుడైనా ఓ క్షణం ఆలోచించటానికి తీరిక దొరికినప్పుడు ఇలాగే ఆలోచిస్తుంది సుగుణ. ఇప్పటి వరకు ఫరవాలేదు నలభై దాటినప్పటి నుండి మెల్ల మెల్లగా వయసు మరుగై వృద్ధాప్యపు ఛాయలు అలముకుంటాయి అనుకుంది సుగుణ.

పిల్లలు పెద్దయి పెళ్ళిళ్ళు కూడా అయిపోతే తనకు కోడలు, అల్లుడు వస్తారు. అప్పుడు తను అత్తగారై పోతుంది. అప్పటి నుండి ఈ పూల పూల షిఫాన్ చీరలు మానేసి తను పెద్ద అంచు జరీ చీరలు కట్టుకోవాల్సి ఉంది. జడ మానేసి కొప్పు వేసుకోవాల్సి వస్తుంది. అప్పుడు ఎలా ఉంటుంది తను? ఇప్పుడు ఇంకా కాస్త మిగిలిన ఈ వయసు, గ్లామర్ అంతాపోయి అప్పుడు తనకు పెద్దరికం వచ్చేస్తుంది. వయసులో ఉన్న టీనేజ్ పిల్లలంతా

తనను 'ఆంటీ' అని పిలుస్తారు. అప్పుడు ఎలా ఫీల్ అవుతుంది తను? ఏమో తనకు మాత్రం 'ఆ లైఫ్ రొటీన్‌గా, ఇతరుల కోసం బ్రతుకుతున్నట్లుగా మారిపోతుందేమో' అనిపిస్తుంది. 'తనకంటూ ఎలాంటి ఆనందం, ఆసక్తి మిగిలి ఉండవు' అనిపిస్తుంది. 'ఏది ఏమైనా ఇప్పుడనుభవిస్తున్న ఈ జీవితమే బాగుంది. కాలం ముందుకు పోకుండా ఇక్కడే ఆగిపోతే బాగుండు, తన వయసు ఇక పెరగకుండా ఇక్కడితో ఆగిపోతే ఎంత ఆనందంగా ఉంటుంది' అనుకుంది సుగుణ.

• • •

కాలం ఎవరి కోసమూ ఆగదు. దాని ఋతు ధర్మాన్ని, దాని వయో ధర్మాన్ని తాను నిర్వర్తించు కుంటూ ముందుకు సాగిపోతూనే ఉంటుంది. కాలం ఒక్క క్షణం స్తంభించిపోతే, ప్రకృతి తన ధర్మాన్ని నెరవేర్చడం ఒక్క త్రుటి కాలం మానేస్తే ఏం జరుగుతుంది? ఎన్నో కోట్ల జీవుల జన్మ నిలిచిపోతుందా? అతలాకుతలమై అన్ని చోట్లా 'అయోమయం, అలజడి' చోటు చేసుకుంటాయా? ఆ 'మృత్యుక్షణం' నుండి బయట పడ్డ మనిషి కలకాలం చిరంజీవిగా ఉండిపోగలుగుతాడా? ఈ ప్రపంచంలో అసలు 'చావు' అనేదే లేకుంటే ఎలా ఉంటుంది? ఏం జరుగుతుంది? 'సృష్టి, స్థితి, లయ'లు ఒక్క క్షణం స్తంభించిపోతే ఏం జరుగుతుంది అన్నది మానవుని 'ఊహ'కు అందని ప్రశ్న. నిజానికి అలా జరగదు కనుక అలా ఊహించి వేసే ప్రశ్నలకూ సమాధానం ఉండదు.

కాలం ముందుకు, ముమ్ముందుకు నడుస్తూనే ఉంది. సుగుణ పిల్లలిద్దరికీ పెళ్ళిళ్ళు చేసి 'అత్తగారు' కూడా అయిపోయింది. 'ఇరవై సంవత్సరాలు పూలమొక్కలా అపురూపంగా తన చేతుల్లో పెరిగిన 'చిన్ని' పెద్దదై పెళ్ళి కూతురైతే ఆ రోజు చూడటానికి తనకు రెండు కళ్ళు చాలలేదు. కన్న కూతురిని అత్తమామల కప్పగింతలు పెడుతుంటే తన గుండె చెరువైపోయింది. ఇక 'నానీ' పెళ్ళిలో అయితే మగపిల్లాడి తల్లిగా తను ఎంతో గర్వంగా తలెత్తుకొని మరీ తిరిగింది. వేడుకలు, లాంఛనాలు, వియ్యపురాలి అలుక అంటూ ఆడపెళ్ళి వాళ్ళను ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించింది. కోడలు సుధను ఇంట్లో అడుగుపెట్టిన కొత్తలో ఎంతో గారాబంగా, మురిపెంగా చూసుకున్నా తరువాత తనలో తనకు తెలియకుండానే 'అత్తగారి'నన్న అహం ప్రవేశించింది. ఆలస్యంగా నిద్రలేస్తుందనో, మొగుడితో సినిమాలకు, షికార్లకు తిరుగుతుందనో పిల్లిమీద ఎలుకమీద పెట్టి ఎప్పుడూ సాధించేది. తనకు అందులో ఏదో తెలియని ఆనందం, తృప్తి లభించేవి అని నడివయసు దాటి వృద్ధాప్యంలో అడుగుపెడుతున్న సుగుణ. తనను గురించి, తన మనస్తత్వంలో వచ్చిన మార్పు గురించి ఇలా అంచనా వేసుకుంది. ఈ అంచనా ప్రతి ఒక్కరూ వేసుకుంటారు. తమ ప్రవర్తన ఏమిటో, అందులోని లోపాలు ఏమిటో ప్రతి అంతరాత్మకు తెలుస్తూనే ఉంటాయి. అంటే ప్రతి ఒక్కరూ 'ఇది తప్పు' అని తెలిసే తప్పులు చేస్తుంటారు. కానీ ఎందుకో మనస్సాక్షి ముందు ఒక్కసారి కూడా తలవంచరు.

ఈ మధ్య అద్దంలో చూసుకుంటున్నప్పుడు కొత్తగా తనలో వస్తున్న మార్పులను గమనిస్తూనే ఉంది సుగుణ. జుట్టు అక్కడక్కడా నెరుస్తోంది. మెడ మీద, బుగ్గల మీద చర్మం ముడతలు పడి మునుపటి నునుపు, కాంతి తగ్గిపోతున్నాయి. చిన్ని 'గర్భిణి' అని ఉత్తరం రాసింది. కొద్ది రోజుల్లో తను అమ్మమ్మ కూడా కాబోతున్నదన్న మాట. కానీ ఎందుకో అమ్మమ్మ కావటానికి మనసు అంగీకరించడం లేదు. తను ముసలిదై పోతున్నట్లు, చావుకు దగ్గరైపోతున్నట్లు ఏవో నిరాశా, నిస్పృహలు మనసంతా ఆవరించేస్తున్నాయి. తల్లిగా ఆడపిల్లకు పురుళ్ళు పోయక తప్పదు. పుట్టిన మనవళ్ళకు, మనవరాళ్ళకు నీళ్ళు పోయక, ఉగ్గుపట్టక తప్పదు. అసలు తనకు 'మనవళ్ళు' అన్న మాటే చిరాకు కలిగిస్తుంటే, వాళ్ళను ఎలా దగ్గరికి తీయటం? తనను 'ముసలమ్మ'గా మార్చిన వాళ్ళను చూస్తుంటే కోపం, చిరాకు కలగవూ?' అనుకుంది సుగుణ, భవిష్యత్తును గురించి ఆలోచిస్తూ.

• • •

ఓ రోజు 'చిన్ని' ఆడపిల్లకు జన్మ ఇచ్చి 'అమ్మ' ఐపోయింది. తన ఒళ్ళో పడుకుని కాళ్ళూ, చేతు లు ఆడిస్తూ బోసి నవ్వులు నవ్వుతున్న మనవరాలిని చిరునవ్వు ముఖంతో మురిపెంగా చూసుకుంది సుగుణ. 'లేత తమలపాకు లాంటి బుజ్జి బుజ్జి చేతులు, బుజ్జి కాళ్ళూ, లక్క పిడత లాంటి 'చిన్న మూతి' ఎంత ముద్దుగా ఉందో' అనుకుంది కొత్తగా అమ్మమ్మ అయిన సుగుణ. 'ఇంట్లో చంటి పిల్ల ఏడుపు వినిపించి ఎన్ని సంవత్సరాలైందో. నిజంగా 'పిల్లలున్న లోగిలే లోగిలి' అనుకుంది మనవరాలిని పదే పదే చూసుకుంటూ.

మరో ఆరునెలల తర్వాత సుగుణ బామ్మ కూడా అయింది. ఇప్పుడు సుగుణ, 'సుగుణమ్మ' అయిపోయింది. మనవడు అచ్చం తన కొడుకు 'నానీ' నోట్లో నుంచి ఊడిపడ్డట్టు ఉంటాడు. వాడి తప్పటడుగులు, వాడి ముద్దు ముద్దు మాటలు వింటూ ఉంటే సుగుణకు తన కొడుకు చిన్నతనం గుర్తుకి వస్తోంది. అచ్చం ఇలాగే ఉండేవాడు అనుకుంది. బామ్మ బామ్మ అంటూ తనను చూడగానే అమాంతం మీద పడిపోతాడు. తనకూ వాడిని చూస్తే ప్రాణం లేచి వస్తుంది. బజారు కెళ్ళినప్పుడల్లా వాడికోసం బొమ్మలు, బిస్కట్లు, డ్రస్సులు తేవటంలో మాటల్లో చెప్పలేనంత ఆనందాన్ని అనుభవిస్తుంది తను. తన చేతిలో బిస్కట్ పొట్లం చూడగానే వాడి ముఖంలో కనిపించే ఆనందం తనకు వర్ణనాతీతమైన అనుభూతిని కలిగిస్తుంది. వాడి ముఖంలో కనిపించే ఆ ఆనందం కోసమే తను అవీ, ఇవీ తెచ్చి ఇస్తూ ఉంటుంది. 'అసలు కన్న వడ్డీ ముద్దు' అన్నట్లు నీకు నా మీద కన్నా మనవడి మీదే ఎక్కువ ప్రేమనే అమ్మా' అంటుంటాడు కొడుకు ఎప్పుడూ.

ఎప్పటికప్పుడు తనలో వస్తున్న మార్పుకు తనలో తనే బోలెడు ఆశ్చర్యపోతుంది సుగుణ. ఎదుగుతున్న వయసును, జీవితంలో రాబోయే మార్పును తలుచుకొని ముందుగానే తను ఎంతో భయపడిపోయేది. కానీ తీరా ఆ మార్పు వచ్చాక ఎప్పటికప్పుడే ఆ జీవితమే బాగున్నట్లు, అసలు అదే జీవితం అన్నట్లు అనిపిస్తున్నది. ఏ వయసుకు తగ్గ మనసు ఆ వయసుకు ఉంటుందని, ప్రతి వయసులోనూ ఆ వయసుకు తగ్గ అనుభవాలు, అభిరుచులు జీవితాన్ని ఆనందంలో ముంచేస్తాయని అర్థమైంది సుగుణకు. ఈ ప్రపంచంలో ఏ వ్యక్తీ 'ఏజ్ కాన్షియస్' కావల్సిన అవసరం లేదు. 'మనిషిని మానసిక రోగి'గా మారే ప్రమాదం నుండి తప్పిస్తూ ప్రకృతి 'ఏ వయసు కా అందాన్ని' మనకు వరంగా ప్రసాదించింది. ✱



వర్ధమాన నర్తకి

షీలా

నృత్యాన్నభ్యసించిన అనతికాలంలోనే అనేక నృత్యప్రదర్శన లివ్వడమేకాక స్వయంగా హైదరాబాదు వివేకనగర్‌లో నృత్యశిక్షణాసంస్థను నడిపిస్తున్నారు నృత్యాకళాకారిణి షీలా. మాతృ భాష కన్నడమైనా తండ్రిగారి వ్యాపారరీత్యా హైదరాబాదులోనే స్థిరపడడంతో ఇక్కడే ఆమె విద్యాభ్యాసం జరిగింది. తన కుటుంబంలో ఎవరూ నృత్య ప్రదర్శనలివ్వకపోయినా టి.వి.లో వచ్చే నృత్య కార్యక్రమాలు చూసి ఆకర్షితురాలై మహంకాళిమోహన్‌గారి వద్ద కూచిపూడి నృత్యాన్ని 1989 నుంచి నేర్చుకోడం మొదలు పెట్టి 1990 డిసెంబరులో ఆదిలాబాద్‌జిల్లా ఉట్నూరులో తొలి ప్రదర్శన ఇచ్చారు. అది మొదలుకొని హైదరాబాదు తదితర ప్రదేశాల్లో షీలా వివిధ నృత్య ప్రదర్శనలిచ్చారు. గత ఆగస్టు 22, 23, 24 తేదీల్లో కూచిపూడి నృత్యం ఆవిర్భవించిన కృష్ణాజిల్లా కూచిపూడిగ్రామంలో జరిగిన సిద్ధేంద్ర కళాక్షేత్ర ఉత్సవాల్లో పలువురు నృత్యనిష్ణాతుల సమక్షంలో నృత్యప్రదర్శనలిచ్చి వారి ప్రశంసలు పొందింది. హైదరాబాదు న్యూసైన్స్ కళాశాలలో బి.యస్‌సి., రెండవ సంవత్సరం చదువుతున్న షీలా రోజూ కాలేజీ తర్వాత తాను నెలకొల్పిన నృత్య శిక్షణా సంస్థలోని విద్యార్థినులకు శిక్షణ యిస్తున్నారు. — వసుంధర